విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 11, ఏప్రిల్ 2025

## సివిల్ సప్లై స్టాక్ పాయింట్ తనిఖీ

**విశాలాంధ్ర- ఉరవకొండ :** మండల కేంద్రంలోని సివిల్ సప్లై స్టాక్ పాయింట్‌ను స్పెషల్ ఆఫీసర్ తిప్పేనాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోడౌన్లలోని రికార్డులు, స్టాకును పరిశీలించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న సబ్సిడీ నిత్యావసర సరుకులను ఉరవకొండలో కొందరు స్టోర్ డీలర్లు లబ్ధిదారులకు అందించడం లేదని విలేకరులు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో.. లబ్ధిదారులకు ఎవరైనా డీలర్లు సరుకులు అందివ్వలేదని ఫిర్యాదులు వస్తే 6ఏ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. దీనిపై తాసిల్దారు కూడా తక్షణమే డీలర్లను సమావేశపరిచి ఆదేశాలివ్వాలని కోరారు. తాసిల్దార్ మహబూబ్ బాషా,స్టాక్ పాయింట్ అధికారి పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య..

**విశాలాంధ్ర-ఉరవకొండ :** స్థానిక జగనన్న కాలనీలో నివాసముంటున్న వడ్డే జయలక్ష్మి(47) గురువారం తెల్లవారు జామున తన ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. భార్యా భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నడంతో ఆమె ఈ ఘాతకానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఉరవకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అభివృద్ధి పనుల పరిశీలన

**విశాలాంధ్ర-బొమ్మనహాళ్ :** మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారంఅనంతపురం ప్రాజెక్ట్ డైరెక్టర్ సలీంభాష, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగేశ్వరరావు, బొమ్మనహాళ్ ఎంపీడీఓ విజయభాస్కర్ పరిశీలించారు. జాతీయ ఉపాధిహామీ పథకం కింద లిం గదహాళ్, కొళగానహళ్లి, నేమకల్లు గ్రామాలలో జరుగుతున్న సీసీరోడ్లు, గోకులంషెడ్లు, అవని ప్లాం టేషన్ పండ్ల మొక్కల పెంపకం, పశువుల తొట్టె నిర్మాణాల పనులను పరిశీలించారు. నేమకల్లు గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీల పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి కూలీల సంఖ్య పెంచాలని ఫారంఫండ్, వ్యక్తిగత ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎండలు ఎక్కువ అవుతున్న నేపథ్యంలో కూలీలను ఉదయాన్నే పనులకు తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పం చాయతీరాజ్ జేఈ జగదీష్, ఏపీఓ భాగ్యలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్లు బ్రహ్మయ్య, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాములమ్మ తల్లి వార్షికోత్సవం

**విశాలాంధ్ర-యాడికి :** చందనరోడ్‌లో వెలసిన రాములమ్మ తల్లి ఆలయ 8వ వార్షికోత్సవం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో గురువారం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. అయ్యప్పస్వామి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజు స్వామి, రాములమ్మ దేవాలయ పూజారి లింగమ నాయుడు ఆధ్వర్యంలో తెల్లవారుజామునే అమ్మవారిని వివిధ రకాల పూలతో, బహు సుందరంగా అలంకరించి,అభిషేకం, అర్చ నలు, హారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల సహకారంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో రామరాజు, రంగడు, రామ్మోహన, రంగనాయకులు, రవి, మునీశ్వర్‌నాయుడు పాల్గొన్నారు.

## జగన్‌కు భద్రత కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోర వైఫల్యం

### మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి

**విశాలాంధ్ర- ఉరవకొండ :** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి భద్రత కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోర వైఫల్యం చెందిందని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం వజ్రకరూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అత్యంత ప్రజాదరణ గల నాయకుడిగా జగన్ గుర్తింపు ఉందని.. రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో జగన్ పర్యటన సందర్భంగా ప్రజల స్వచ్ఛందంగా వేల సంఖ్యలో తరలి రాగా భద్రతను కల్పించడం కంటే పోలీసులు చేత అడ్డుకోవడానికి ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చిందన్నారు, వైయస్ జగన్ పర్యటనలో 400 కె.వి లైన్ల మధ్య హెలిప్యాడ్ ఏర్పాటు చేయడం వల్ల అక్కడే ఉన్న ప్రజలు అనేక సందేహాలు, అనుమానాలు వ్యక్తం చేశారని, దీనిపై వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు, పోలీసులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని కోరారు. వైసీపీ నాయకులు గోవిందు, ఓబన్న, మైనార్టీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు ఉస్మాన్, యువజన నాయకులు శశాంక్ రెడ్డి, సర్పంచులు మోనాలిసా, చాబాల సర్పంచ్ జగదీష్, పాల్గొన్నారు.

## టిడిపి నాయకుడికి ఘన నివాళి

**విశాలాంధ్ర-పామిడి :** పామిడి పట్టణానికి చెందిన వడ్డే శివకుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి బుధవారం రాత్రి వేకువ జామున తుది శ్వాస విడిచారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడుగా సంపూర్ణ సేవలు అందించాడు. ఆయనమరణ వార్త తెలుసుకున్న గుంతకల్లు నియోజకవర్గం నెమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు పామిడి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ పామిడికి వెళ్లి ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం గుమ్మనూరు ఈశ్వర్ మాట్లాడుతూ వడ్డే శివకుమార్ మృతి పార్టీకి తీరని లోటని, పార్టీ గెలుపుకోసం బాగా కష్టపడి పని చేసారని ఈయన మృతి మమ్ములను కల్చి వేసిందన్నారు. అలాగే వడ్డే శివ కుటుంబ సభ్యులను పరామర్శించి 25 వేలు ఆర్థిక సాయం అందించి ఎల్లప్పుడు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## దెబ్బతిన్న పంటల పరిశీలన

**విశాలాంధ్ర -కనేకల్ :** మండల పరిధిలోని కనేకల్ క్రాస్ పుల్లంపల్లి గ్రామాల్లో బుధవారం వీచిన బలమైన గాలులకు దెబ్బతిన్న మొక్కజొన్న పంట పొలాలను గురువారం వ్యవసాయ అధికారులు సందర్శించి పంట ప్రాథమిక నష్టం విలువను అంచనా వేశారు. 65 రోజుల మొక్కజొన్న పంట చెట్లు వయసు కలిగిన పైరులో గింజలు పాలు పోసుకునే సమయంలో ప్రకృతి వైపరీత్యానికి రైతులు తీవ్రంగా నష్టపోయాయని తెలిపారు. కనేకల్ క్రాస్, పుల్లంపల్లి సుమారు 62 మంది రైతుల 48 హెక్టార్లలో మొక్కజొన్న పంట దెబ్బతిని సుమారు 6, 67 లక్షల నష్టం జరిగి ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు. నష్టపోయిన రైతుల భూమి పట్టా పాసు పుస్తకం ఆధార్ బ్యాంక్ ఖాతా జిరాక్సును రైతు సేవ కేంద్ర కార్యాలయంలో సమర్పించాలని విజ్ఞప్తి చేశారు.

## వక్ఫ్ బోర్డు బిల్లును బేషరతుగా రద్దు చేయండి

**విశాలాంధ్ర-తాడిపత్రి:** వక్ఫ్ బోర్డు బిల్లును బేషరతుగా రద్దు చేయాలని స్వర్ణకారుల సంక్షేమ సంఘం సభ్యులు, దూదేకుల సేవా సంఘం సభ్యులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ముల్లాంపుల్ సర్కిల్, సిద్ది భాష దర్గా వద్ద వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా తాడిపత్రి ప్రాంత ముస్లిం సమాజ పెద్దలు నాలుగవ రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. ఈ రిలే నిరాహార దీక్షలకు స్వర్ణకారుల సంక్షేమ సంఘం సభ్యులు, దూదేకుల సేవా సంఘం సభ్యులు మద్దతు తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ముస్లింలపై కక్షపూరిత చర్యలు చేపడుతూ వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు పార్లమెంటు, రాష్ట్రపతి వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఎన్నో ఏళ్ల నుండి హిందూ, ముస్లిం బాయ్ బాయ్ అంటూ జీవిస్తున్న భారత సమాజంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం చిచ్చు పెడుతుందన్నారు. వక్ఫ్ బోర్డు బిల్లును వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు యు. జాకీర్ హుస్సేన్ దూదేకుల సేవా సంఘం అధ్యక్షుడు పెయింటర్ భాష పద్మ వాణి స్కూల్ కరస్పాండెంట్ నాగ పేరయ్య పాల్గొన్నారు.

### బైక్ ర్యాలీతో సంఘీభావం

**విశాలాంధ్ర-యాడికి :** మండలంలోని రాయలచెరువు, మసీదుల నుండి ముస్లిం సోదరులు బస్టాండ్ కూడలిలో గురువారం మానవహరంగా ఏర్పడి కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఆమోదించిన వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తాడిపత్రి పట్టణంలోని సిద్ది భాష దర్గా వద్ద ముస్లిం సోదరులు చేపట్టిన రిలే దీక్షలలో మత పెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు అనంతరం జూటూరు రబ్బాని, చాంద్ భాషా మాట్లాడుతూకేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థను కాలరాసే విధంగా వ్యవహరిస్తోందని అన్ని రాజకీయ పార్టీలు వక్ఫ్ బోర్డ్ బిల్లును వ్యతిరేకిస్తున్నప్పటికీ దొడ్డిదారిన పార్లమెంటులో ఆమోదించడం దుర్మార్గం అన్నారు. ఈ బిల్లు వల్ల పేద ముస్లింలకు న్యాయం జరుగుతుందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిజంగా వక్ఫ్‌భూమి అవునో కాదో నిర్ధారణ చేసుకున్నాకే ప్రభుత్వం వక్ఫ్ బోర్డు స్థలాలకు ఆమోదం ఇచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని సలీం భాషా, స్టార్ ఎలక్ట్రికల్ షరీఫ్, సులేమాన్, సెల్ పాయింట్ చాంద్ భాషా, హాజీమస్తాన్, ఫిరోజ్ భాష, అచ్చుకట్ల భాష, హాజీ వలి, కోటవీధి షేక్ష, జాఫర్ పాల్గొన్నారు.

## ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలి

**విశాలాంధ్ర-బ్యూరో అనంతపురం:** శ్రీ కృష్ణ దేవరాయ యూనివర్సిటీలో ఖాళీగా వున్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్ట్ లను భర్తీ చేయాలని ఎస్ కె యూనివర్సిటీ ఎఐఎస్ఎఫ్ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్సీ రామ్ గోపాల్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ కె యూనివర్సిటీ కార్యదర్శి రమణయ్య మాట్లాడుతూ రెగ్యులర్ విసిని నియమించక పోవడం పాలనా పరంగా సాంకేతికంగా సమస్యలు సకాలంలో పరిష్కారం కావడం లేదన్నారు. మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని.. ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాదయాత్రలో నిరుద్యోగులకు మాట ఇచ్చారని గుర్తు చేశారు. అదేవిధంగా కానిస్టేబుల్ మెయిన్ ఎగ్జామ్ త్వరగా పూర్తి చేయాలని, నిరుద్యోగులకు నిరుద్యోగ అభివృద్ధి అందిస్తామని చెప్పిన మాట ఇంత వరకు నెరవేరలేదన్నారు. పెండింగ్ స్కాలర్ షిప్ ఫీజు రియంబర్స్‌మెంట్ అందజేయాలన్నారుఎస్‌కె యూనివర్సిటీ ఏఐఎస్ఎఫ్ నాయకులు సాయి మహేష్, శ్రీను నాయక్, జగదీష్, రాజు, నరేంద్ర పాల్గొన్నారు.

## గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రక్షించండి..

### ముఖ్య అతిథిగా హాజరుకానున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

**విశాలాంధ్ర-రాప్తాడు :** చట్టబద్ధంగా ఆమోదించబడిన ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకుంటామని, ఇతర రంగాలకు ఉపాధి నిధులు మళ్లించకుండా పక్కాగా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కేశవరెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాకే నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు పెరుగు సంగప్ప, ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకులు వై.ఎల్. రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈనెల 21.22, తేదీల్లో బండ్లపల్లి నుండి అనంతపురం వరకు చేపట్టనున్న పాదయాత్రకు ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరవుతారని గురువారం వారు ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ చట్టం పక్కాగా అమలు జరిగితేనే పేదలకు ఉపాధి, గ్రామీణాభివృద్ధి జరుగుతుం దన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ చట్టానికి బడ్జెట్‌లో రూ. 4.60 లక్షల కోట్లు కేటాయించవలసి ఉండగా ఈ యేడాది కేవలం రూ.86 వేల కోట్లు మాత్రమే కేటాయించడం దారుణ మన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వలసలు తీవ్రమవు తున్నా నివారణకు చర్యలు తీసుకోవడం లేదు. కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని నిర్వీర్యం చేసి, నీరుగారుస్తూ చట్టం స్ఫూర్తికి విరుద్ధంగా, వ్యవసాయానికి అనుసంధానించాలనే నిరంకుశ విధానానికి వ్యతిరేకంగా, చట్టాన్ని రక్షించుకోవడం కోసం తమ బాధ్యతగా పోరాటాలకు సిద్ధం అవుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈఏడాది బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. ఈ పాదయాత్ర కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకత్వం పాల్గొంటుం దన్నారు. రెండవ రోజు అనంతపురం టవర్ క్లాక్ దగ్గర బహిరంగ సభ ఉంటుందన్నారు. ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు కల్పించి వలసలు ఆపాలని, ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేయరాదు. మెటీరియల్ కాంపోనెంట్‌ను పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి. పథకం లో నిధులు పక్క దారి పట్టించరాదు. కూలీల భద్రత కోసమే వచ్చిన ఈ పథకంలోని నిధులన్ని వారికే కేటాయించా లన్నారు. కుటుంబ జాబ్ కార్డుతో నిమిత్తం లేకుండా ప్రతి వయోజనుడికి విడిగా జాబ్ కార్డు ఇవ్వాలన్నారు. పని అడిగిన వారికి 200 రోజులుపని దినాలు కల్పించాలన్నారు. రోజు కూలి రూ.700 ఇవ్వాలన్నారు. ప్రతి గ్రూపుకు పని కల్పించాలని, పని కల్పించకపోతే ఉపాధి భృతిగా ఏడాదిలో ప్రతికూలీకి రూ.12 వేలు అందించాలన్నారు. ఉపాధి హామీలో రాష్ట్ర మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసి అందులో వ్యకాసం ప్రతినిధులను చేర్చాలని కోరారు,..

## వేరుశనగ పంటకు ఎకరాకు రూ.50 వేలు అందించాలి..

### జిల్లా రైతు సంఘం అధ్యక్షులు చిన్నప్ప యాదవ్

**విశాలాంధ్ర-శింగనమల :** అకాల వర్షాలకు దెబ్బతిన్న వేరుశనగ పంటలకు ఎకరాకు రూ.50 వేలు అందించాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షులు చిన్నప్ప యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ రైతు సంఘం ఆధ్వర్యంలో శింగనమల కెనరా బ్యాంక్ సిబ్బందికి పంట రుణాలు సమస్యలకు సంబంధించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిన్నప్ప యాదవ్ మాట్లాడుతూ పంట పెట్టుబడులు ఎక్కువ అవుతున్నందున ప్రభుత్వ రంగ బ్యాంకులలో వేరు శనగకు ఎకరాకు రూ.50 వేల స్కేలాఫ్ ఫైనాన్స్ ఇచ్చి అదనంగా 30 శాతం అందించాలన్నారు. పత్తి, స్కేలు అప్ ఫైనాన్స్ ఎకరాకు రూ.46 వేలు, కంది పంటకి ఎకరాకు 34 వేలు ఈ సంవత్సరానికి నిర్ణయించారని, వర్షాధార పంటలకు వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ మొత్తాన్ని పెంచాలని, బంగారుపై రుణాలకు వడ్డీ మాత్రమే కట్టించుకొని రెన్యూవల్ చేయాలని, కొన్ని బ్యాంకులు బంగారు రుణం రూ.2 లక్షలు దాటితేనే రాయితీలు వర్తిస్తాయని చెబుతున్నారని, వాటిని సవరించాలన్నారు. కెనరాబ్యాంకు పరిధిలో క్రాప్ లోన్లు నోడ్యూస్ లేకుండా వెబ్ ల్యాండ్ అధారంగా రైతులకు రుణాలు అందించాలని, చేనేత కార్మికులకు సబ్సిడీ రుణాలు, ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ, వర్గాలకు పీఎంఈజీబి కిందపాడి, పశువులకు గొర్రెలకు, మేకలకు, చిన్నతరహా వ్యాపారులకు, స్త్రీ శక్తి, ముద్ర రుణాలు అర్హులందరికీ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మధుయాదవ్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి, చేనేతమధు వెంకటరెడ్డి, చితంబరప్ప, మధురెడ్డి, దస్తగిరి, జయరాం నాయక్, హనుమప్ప పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలపై చర్యలు తీసుకోండి..

**విశాలాంధ్ర-గుంతకల్ :** ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలపై చర్యలు తీసుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి పి.రాము రాయల్ సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్.గోపీనాథ్ డిమాండ్ చేశారు. ఫైనాన్స్ సంస్థ, రాధమ్మ అనే మహిళ కుమ్మక్కై మహిళలను మోసం చేసినందుకు వీరిపై పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. గురువారం పట్టణంలో ఫైనాన్స్ సంస్థల చేతుల్లో మోసపోయిన జి.కొట్టాల గ్రామ దళిత కుటుంబాలకు చెందిన మహిళలతో కలసి అజంతా సర్కిల్ నుంచి ర్యాలీగా వెళ్లి టాటా కెప్టెన్ ఫైనాన్స్ ఆఫీస్ దగ్గర లబ్ధిదారులతో ధర్నా చేపట్టారు.

బాధితులకు అండగా ఉండాల్సిన పోలీసులు గుంతకల్లు ఫైనాన్స్ సంస్థలకు రక్షణ కల్పించడం చాలా సిగ్గుచేటన్నారు. గుంతకల్లు ప్రాంతంలో స్పందన ఫైనాన్స్, కీర్తన గోల్డ్ ఫైనాన్స్, స్పందన టాటా క్యాపిటల్ ఫైనాన్స్ గ్రామీణ కూటమి ఫైనాన్స్ పిన్ కేర్ ఫైనాన్స్ సంస్థ శ్రీరామ్ ఫైనాన్స్ సంస్థ, బళ్లారి ఫైనాన్స్ వారం వారం కంతుల, వడ్డీ వ్యాపారులు అధిక వడ్డీలు వసూలు చేస్తూ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారు ఉదయం నుంచి రాత్రి 11 గంటల సమయానికి ఇంటి దగ్గరనే ఫైనాన్స్ వారు గుంపులు గుంపులుగా వచ్చి గొడవ చేస్తున్నారన్నారు. జి.కొట్టాల గ్రామంలో ఫైనాన్స్ ఏజెంట్లు కుమ్మక్కై మోసం చేశాయని. 30 కుటుంబాలు వేధింపులకు తాళలేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి కల్పించారన్నారు. అధిక వడ్డీలకు డబ్బులు ఇస్తూ సామాన్యులను పీడిస్తున్న వడ్డీ వ్యాపారుల పట్ల నిఘా పెట్టాలని తెలిపారు. పోలీసు వ్యవస్థ తాసిల్దార్ గ్రామాలలో పర్యటించి బాధితులకు మనోధైర్యాన్ని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ శాఖ కార్యదర్శి దాసరి శ్రీని వాసులు కొట్టాల శాఖ కార్యదర్శి ఆటో సూర్యనారాయణ, బాలకృష్ణ ఆటో శివ, బాధితులు పేర్లు:- పెద్దక్క, భవాని, సరోజ, ఆదిలక్ష్మి, రంగమ్మ, అంజనమ్మ ,చౌడమ్మ, రామాంజనమ్మ, ఓబులమ్మ, దుర్గమ్మ ,సునీత, రేణుకమ్మ, కృష్ణమ్మ, దేవాతి, దేవక్క, సువర్ణ ఉన్నారు .

## సూపర్ సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలి..

### సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నారాయణ స్వామి

**విశాలాంధ్ర-గార్లదిన్నె :** స్థానిక మండల సీపీఐ కార్యాలయంలో మండల సీపీఐ సీనియర్ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఏఐవైఎఫ్ నాయకులు శ్రీనాథ్ చౌదరి అధ్యక్షతన జరిగింది ముఖ్య అతిథులుగా నియోజకవర్గ కార్యదర్శి కామ్రేడ్ నారాయణ స్వామి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి దాదాపు సంవత్సర కాలం అవుతున్న ఏ ఒక్క హామీ సరిగా నెరవేర్చలేదని అన్నారు. నారా లోకేష్ పాదయాత్రలో భాగంగా గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామంలో చీనీ పండ్ల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని చెప్పినా ఇంత వరకు ఎలాంటి చర్యలు లేవన్నారు. శ్రీనాథ్ చౌదరి మాట్లాడుతూ మండలంలో అర్హులైన పేదలకు పక్క గృహాలు నిస్పక్షపాతంగా పార్టీలకు అతీతంగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. దేశంలోనే గార్లదిన్నె మండలంలోని చీనీ పండ్లకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉన్నా ఏ ప్రభుత్వం కూడా చీనీ రైతులకు ఎలాంటి న్యాయం చేయలేదని, దళారీ వ్యవస్థ నుండి కాపడలేదని తెలియజేశారు. అలాగే గార్లదిన్నె మండల మహాసభలను మే 5న, మండలంలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో సీపీఐ శాఖ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ నియోజకవర్గ నాయకులు రామంజి, సీపీఐ మండల కార్యదర్శి వన్నూర్ స్వామి, సహాయ కార్యదర్శులు రామకృష్ణ, అంజీనమ్మ, సీనియర్ నాయకులు ఎండి రాముడు, జగన్నాథ్,శివయ్య,రామచంద్ర ఆచారి మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చేనేత సంఘం వార్షికోత్సవం

**విశాలాంధ్ర- యాడికి :** మండల కేంద్రంలోని వెంగమ నాయుడు కాలనీలో గురువారం చేనేత కార్మిక సంఘం 90వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా చేనేత కార్మికులు, కాలనీవాసులు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి సిపిఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి పామిశెట్టి గోవిందు, జిల్లా సహాయ కార్యదర్శి గుండా శ్రీనివాసులు, హాజరయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు నీలూరు లక్ష్మయ్య చేతుల మీదుగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నీలూరు లక్ష్మయ్య, పామిశెట్టి గోవిందు, జూటూరు మహమ్మద్ రఫీ మాట్లాడుతూ "కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత రంగానికి కేటాయించిన రిజర్వేషన్లను అమలు పరచడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించడం వల్ల, చేనేత మగ్గాలపై తయారు చేసే 11 రకాలను తయారీ ఉత్పత్తులను పవర్ లూమ్ మీద తయారు చేయడం వల్ల, చేనేత కార్మికుల చీరలకు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానంలో ఇచ్చిన హామీ నేతల నేస్తం 24 వేల రూపాయలను పెంచి నేతన్న నేస్తం అందిస్తామని హామీ ఇచ్చారు కానీ ఇంతవరకు అమలు చేయలేదన్నారు చేనేతలకు రెండు వేల కోట్ల రూపాయలు. నిధులు కేటాయించి ఆర్థిక భరోసా కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కుల్లాయి రెడ్డి పెద్దవడుగూరు సిపిఐ మండల సహాయ కార్యదర్శి పోలా రంగస్వామి, పుట్లూరు నరసింహులు వెంకటస్వామి ,,ఆంజనేయులు చేనేత కార్మికులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఇంటిపై కప్పు కూలి ముగ్గురికి తీవ్ర గాయాలు

**విశాలాంధ్ర-పామిడి :** పామిడి పంచాయతీ పి.కొండాపురం గ్రామంలో కిష్టయ్య వ్యక్తి ఇంటి పైకప్పు బుధవారం రాత్రి వేకువ జామున కూలి పడడంతో కుటుంబ సభ్యులైన కృష్ణయ్య భార్య లక్ష్మి కూతురు హారికలకు తీవ్ర గాయాలయ్యాయని తహసిల్దార్ శ్రీధర్ మూర్తి పేర్కొన్నారు. గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఆకస్మాత్తుగా పైకప్పు కూలడంతో పక్క ఇంటి వారు గమనించి మట్టిని తీరును తొలగించి అంబులెన్సు పిలిపించి బాధితులను పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రిలో చేర్పించారు. వీరికి ప్రాణాప్రాయం లేదని తాహసిల్దార్ తెలిపారు.

## మేము పిల్లలం.. అప్పుడే కాము తల్లులం

**విశాలాంధ్ర-శింగనమల :** తరిమెల పిహెచ్‌సి పరిధిలోని వెస్ట్ నరసాపురం గ్రామంలో గర్భిణీ స్త్రీలకు యుక్త వయస్సు స్త్రీలకు, కుటుంబ సభ్యులకు, తరిమెల వైద్యాధికారి డాక్టర్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన సమావేశం నిర్వహించారు. ఆరోగ్య విద్యా బోధకురాలు ఎస్,పర్వీన్ హాజరై సలహాలు సూచనలు అందించారు. బాల్య వివాహాలు చేయరాదని, లింగ వివక్షత పైన,చట్టాల పైన అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. తరిమెల వైద్యాధికారి డాక్టర్ శ శంకర్ నాయక్, పారామెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్ ప్రసాద్ పాల్గొన్నారు.

## అక్రమ అడ్మిషన్స్‌లను అరికట్టండి

**విశాలాంధ్ర- గుంతకల్ :** ప్రైవేట్ విద్యా సంస్థల్లో అక్రమ అడ్మిషన్స్‌లను అరికట్టాని గురువారం పట్టణంలో ఉన్న ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీవోకి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినితిపత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్‌నాయక్ మాట్లాడుతూ నిబంధనలను తుంగలో తొక్కి నూతన విద్యా సంవత్సరం 2025 2026 సంవత్సరానికి అడ్మిషన్ చేసుకుంటున్నారని కోర్సుల పేరిట వేలాది నుండి లక్షల రూపాయల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. పుస్తకాల, స్కూల్ యూనిఫార్మ్, షూ బెల్ట్ అని చెప్పి తల్లిదండ్రుల వద్ద డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు తగు చర్యలు తీసుకోకుంటే ధర్నాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్ష కార్యదర్శి రోహిత్ ,శివమణి, పట్టణ సహాయ కార్యదర్శి ఫర్హాన్, పట్టణ నాయకులు జయప్ప, ముస్తఫా ,అర్షద్, ధనుజయ, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు 10 జీవాల మృతి

**విశాలాంధ్ర-గార్లదిన్నె :** మండలంలోని పెనకచర్ల గ్రామంలో ఎస్సీ కాలవ దగ్గర సాయంత్రం 4 గంటలకు గొర్రెల కాపరి చిదంబరప్పకు చెందిన ఎనిమిది గొర్రెలు, రెండు మేకలు పిడుగు పడి మృత్యువాత పడ్డాయి. బాధితుడు చిదంబరప్ప అప్పు తెచ్చి గొర్రెలు పెంచుకుంటున్నాడు. దాదాపు రూ. రెండు లక్షల వరకు నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఆర్థిక సాయం చేయాలని బాధితుడు కోరారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు ..

**విశాలాంధ్ర-యాడికి :** మండల పరిధిలోని రాయలచెరువు గ్రామంలోని చందన గేటు వద్ద గురువారం టిప్పర్ ఢీకొన్న సంఘటనలలో మహిళ తీవ్రంగా గాయాల పాలయ్యింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు చిక్కేపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీదేవి పెద్దవడుగూరు మండలం రావులుడికి గ్రామంలో చేన్నమయ్య స్వామి తిరుణాలకు వెళ్లి వస్తుండగా చందన గేటు సమీపంలో ఆటో దిగి ఆర్టీసీ బస్సు ఎక్కబోయి టిప్పర్ కింద పడి లక్ష్మీదేవి చెయ్యి తెగిపోవడంతో గమనించిన స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మంత్రి కేశవ్ ను సన్మానించిన ప్రభుత్వ పాలిటెక్నిక్ అధ్యాపక బృందం

**విశాలాంధ్ర-ఉరవకొండ :** ఉరవకొండ ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలకు సత్యసాయి జిల్లాలో ఉన్న కియా ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ స్కీం కింద 40 లక్షల రూపాయలు విలువగల ప్రయోగశాల పరికరాలు, యంత్రాలను సమకూర్చనుంది. ఈ పరికరాలు రావడానికి కృషి చేసిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ను గురువారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ తో పాటు అధ్యాపక బృందం ఘనంగా సన్మానించింది. మంత్రి పయ్యావుల కేశవ్ కు కియా కంపెనీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. ఆశ్రఫ్ అలీ, ట్రిపుల్ ఇఇఇ విభాగాధిపతి వై.సురేష్ బాబు, జనరల్ సెక్షన్ శాఖాధిపతి వి. నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ కార్పొరేట్ అక్రమ దందా అరికట్టుండి

**విశాలాంధ్ర-రాయదుర్గం:** పట్టణంలోని ప్రైవేట్ కార్పొరేట్ విద్య హక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతున్న ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్లఅక్రమ అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం ఆంజనేయులు మాట్లాడుతూ రాయదుర్గం పట్టణంలో కార్పొరేట్ ప్రైవేటు స్కూళ్లలో విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులకు మాయ మాటలు చెప్పి ధనర్జన నే ధ్యేయంగా విద్య హక్కు చట్టాలను తుంగలోకీ తొక్కుతూ ప్రభుత్వ నియమ నిబంధనలను ఏమాత్రం కూడా పట్టించుకోకుండా తమ ప్రైవేట్ పాఠశాలల్లోనే మంచి విద్యాబోధన దొరుకుతుందని నియోజకవర్గ వ్యాప్తంగా ప్రచారం చేపడుతున్నారన్నారు ఎండాకాలం సెలవులు అనంతరం నిర్వహించాల్సిన అడ్మిషన్లు ఇప్పటి నుండే ప్రైవేట్ పాఠశాలలు నిర్వహిస్తున్నారు ప్రైవేట్ అడ్మిషన్ల పై విద్యాశాఖ అధికారులు ఏ మాత్రం నిమ్మకు నీరు ఎత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాయదుర్గంలో విద్యాశాఖ అధికారులు ఉన్నారా లేదా అనేది అంతు పట్టడం లేదన్నారు ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు మూసుకున్న కళ్ళు తెరిచి ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలతో ప్రత్యక్ష ఆందోళనకు ప్రైవేట్ పాఠశాలలపై దిగుతామని హెచ్చరించారు.

# విశాలాంధ్ర శ్రీ సత్యసాయి

www.visalaandhra.com

కర్నూలు, శుక్రవారం 11, ఏప్రిల్ 2025




## మహిళల ఆర్థిక స్వావలంబన.. కూటమి ప్రభుత్వ లక్ష్యం

### ఉచిత టైలరింగ్ శిక్షణా కేంద్రాలను ప్రారంభించిన మంత్రి సవిత

**విశాలాంధ్ర-గోరంట్ల :** మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధి కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మ తెలిపారు. గోరంట్ల పట్టణంలోని సచివాలయం 4లో మహిళలకు ఉచిత కుట్టు మిషన్ పథకాన్ని ప్రారంభించారు. ఏర్పాటుచేసిన సభలో మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గంలో టైలరింగ్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి ఆర్థికంగా వెనుకబడిన బీసీల మహిళలందరికీ ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్లు అందజేస్తామని తెలిపారు, గోరంట్ల మండల వ్యాప్తంగా 6 కుట్టు మిషన్ కేంద్రాలను ఏర్పాటు చేసి, 90 రోజులపాటు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.ప్రజలకిచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని తెలిపారు. దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు, అలాగే ఉచితంగా ఇసుకను అందజేస్తున్నామని, ఈ ఏడాది పాఠశాలలు తెరిచే సమయానికి తల్లికి ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి 15 వేలు చొప్పున అందించేలా తల్లికి వందనం పథకాన్ని అమలు చేయనున్నామని ,త్వరలోనే మహిళకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం కల్పిస్తున్నామని , అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు రూ.20 వేలు అందిస్తామని తెలిపారు..గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతూ రాష్ట్రంలో పరిపాలనను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గాడిన పెడుతూ ఒకవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు.

సంక్షేమంతో పాటు రాష్ట్రంలో అభివృద్ధి లో దూసుకు పోతోందని గోరంట్ల మండల వ్యాప్తంగా ఇప్పటికే 7.65 కోట్ల రూపాయలతో 81 సీసీ రోడ్లు, పూర్తీ చేశామని ,77 గోకులం షెడ్లు పూర్తీ చేశామని, బీసీ హాస్టల్ రిపేర్ కోసం 27 లక్షల రూపాయలతో పనులు జరుగుతున్నా యన్నారు. మండల వ్యాప్తంగా రూ.7 లక్షలు సి ఎం ఆర్ ఎఫ్ కింద బాధితులకు అందచేసామని, రూ.14 కోట్లతో మండలం వ్యాప్తంగా ఇంటింటికి తాగునీరు అందిస్తామని తెలిపారు.

## స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

### మంత్రి సత్య కుమార్‌యాదవ్ చొరవతో ఆర్వో ప్లాంట్‌కు భూమి పూజ

### తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

### - మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్ బాబు

**విశాలాంధ్ర, ధర్మవరం :** - ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్య కుమార్ యాదవ్ సహకారంతో, సంస్కృతి సేవాసమితి ఆధ్వర్యంలో ధర్మవరం నియోజకవర్గంలోని పోతుకుంట గ్రామంలో రివర్స్ ఆస్మోసిస్ ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయనున్నారు.. ఈ సందర్భంగా గురువారం గ్రామంలో అంగరంగ వైభవంగా భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు ముఖ్య అతిథిగా హాజరై, భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు పరిశుద్ధమైన త్రాగునీరు అందించడం మంత్రి గారి ముఖ్య లక్ష్యం అని, వారి మార్గదర్శకత్వం, అహర్నిశ కృషి వల్లే ఈ మంచి పని కార్యరూపం దాల్చింది అని పేర్కొన్నారు. ఈ ఆర్వో ప్లాంట్ ద్వారా గ్రామంలో త్రాగునీరు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయి, గ్రామస్తులు మంత్రి సహకారానికి , సంస్కృతి సేవాసమితికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ శుద్ధి నీటి ప్లాంట్ ద్వారా తమ ఆరోగ్య భద్రతకు తోడ్పాటు లభిస్తుందన్న నమ్మకంతో హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు గ్రామాన్ని మరింత పురోగతిపథంలో నడిపించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోతుకుంట రాజు, జయరాం ,సూరి , బిలె శ్రీనివాసులు, సుబ్బారావు పేట పవన్ కుమార్ రెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీకి పన్నులు చెల్లించండి

**విశాలాంధ్ర-ధర్మవరం :** 2025-26 సంవత్సరమునకు సంబంధించిన ఇంటి పన్నులు ఈనెల 30వ తేదీలోగా ఏక మొత్తంగా చెల్లించిన వారికి పన్నులో 5 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్నులను మున్సిపల్ కార్యాలయంలో గాని, శివానగర్ పార్కు, సచివాలయంలో గాని, ఎస్బిఐ మెయిన్ బ్రాంచ్ పక్కనగల జేజేఆర్ నగర్ సచివాలయంలో, ఎల్పీ సర్కిల్ అన్నా క్యాంటీన్ పక్కన గల సచివాలయం, లక్ష్మీనగర్ సచివాలయం, పార్థసారథి నగర్-2 సచివాలయం లేదా ఆన్లైన్‌లో చెల్లించి పట్టణ అభివృద్ధికి పాటుపడాలని కోరారు.

## ఆలయంలో అన్నదానానికి విరాళం

**విశాలాంధ్ర-ధర్మవరం** స్వర్గీయ గుద్దటి ఆంజనేయులు, రామ లక్ష్మమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు నాగభూషణం అండ్ బ్రదర్స్ వారు కమిటీ వారు పట్టణంలోని పుట్టపర్తి రోడ్డు-సాయినగర్‌లో వెలిసిన శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో అన్నదానం కోసం రూ.50 వేల విరాళాన్ని కమిటీ వారికి అందజేశారు. తదుపరి ఆలయ కమిటీ దాతల పేరిటన ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షిరిడి సేవా సమితి కమిటీ పాల్గొన్నారు.

## పరీక్ష తేదీ మార్పు..

**విశాలాంధ్ర ధర్మవరం :** పట్టణంలోని గుట్ట కింద పల్లె వద్ద గల ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్) 2025-26 విద్యా సంవత్సరంలో ఆరవ తరగతి లోకి నిర్వహించబడే ప్రవేశ పరీక్ష ఈనెల 20వ తేదీ కాకుండా 21వ తేదీకి ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చబడినదని ప్రిన్సిపాల్ ఆర్.పద్మశ్రీ తెలిపారు. ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 21వ తేదీ ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు నిర్వహించబడే ప్రవేశపరీక్షకు హాజరుకావాలని తెలిపారు. విద్యార్థులు తమ హాల్ టికెట్స్ ను ఆన్లైన్లో ద్వారా (వెబ్సైట్స్) పొందవచ్చు గాని తెలిపారు.

## ఖాళీ బిందెలతో మహిళలు ధర్నా

**విశాలాంధ్ర-గుడిబండ :** మండలంలోని జమ్మలబండ పంచాయతీ పరిధిలోని బూదిపల్లి తండా గ్రామంలో తాగునీటి కోసం ఖాళీ బిందెలతో మడకశిర అమరాపురం ప్రధాన రహదారిపై మహిళలు ధర్నా నిర్వహించారు. ఈ క్రమంలో ప్రధాన రహదారిపై ముళ్ళకంప చెట్లతో ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ రహదారిపై వెళ్లి వాహనాలకు ఒక గంట తీవ్ర అంతరాయం ఏర్పడింది. బూదిపల్లి తండాకు చెందిన మహిళలు అమృత భాయ్,సునీత భాయ్, గీతాబాయి, రేణుక భాయ్,లక్ష్మీదేవి, రత్న భాయ్,తదితరులు మాట్లాడుతూ కేవలం మా తండా గ్రామంలో 28 కుటుంబాల నివాసం ఉంటున్నామని మా గ్రామానికి అరాకొరగా శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ద్వారా వచ్చే నీళ్లను సద్వినియోగం చేసుకుంటామని లేనిపక్షంలో రైతు బోరుబావులకు వెళ్లి నీళ్లు తెచ్చుకునే పరిస్థితి ఏర్పడిందని గ్రామపంచాయతీ అధికారులు ప్రజా ప్రతినిధులు ఎన్ని సార్లు విన్నవించిన తాగునీటి సమస్య పరిష్కారం చేయలేదన్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక మాజీ సర్పంచ్ శ్రీనాథ్ మూర్తి, ఘటన స్థలానికి చేరుకుని మహిళలను కలిసి ఆర్డబ్ల్యూఎస్ అధికారు లతో చరవాణి ద్వారా మాట్లాడి రెండు రోజుల్లో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని తెలియజేయడంతో మహిళలు ధర్నాను విరమించారు. ఈ క్రమంలో తెదేపా సీనియర్ నాయకులు భూదిపల్లి జయరామప్ప,గోపాల్ నాయక్, పాల్గొన్నారు.

## పేదలకు వైద్యం సక్రమంగా అందించండి

### డయాలసిస్ కేంద్రంలో ఏసీలు ఫ్యాన్లు వెంటనే మరమ్మత్తులు చేయించండి



**విశాలాంధ్ర-హిందూపురం :** ఎమ్ఎల్ ఏ. నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య, మునిసిపల్ చైర్ పర్సన్ డి.ఈ. రమేష్ కుమార్ గురువారం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. రోగుల వద్దకు వెళ్లి వైద్యం ఎలా అందుతుందని, నర్సులు సరైన ట్రీట్మెంట్ ఇస్తున్నారా, లేదా, సమయానికి డాక్టర్లు వస్తున్నారా, అని ఆరా తీశారు. ఎమర్జెన్సీ నుండి అన్ని వార్డులు తిరిగారు.అనంతరం సూపరింటెండెంట్ లింగప్ప ఆసుపత్రి సమస్యలు వివరించారు. వైద్యులు సకాలంలో ఆసుపత్రికి వచ్చి వైద్య సేవలు అందించాలని, సిటీ స్కాన్ ను త్వరలోనే మరమ్మత్తులు చేయించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రిలో పరిశుభ్రత నిర్వహణ మరింత మెరుగుపరచాలని, ఆసుపత్రిలో ఉన్న అన్ని విభాగాలలో అడ్మిట్ అయిన రోగులకు సరైన వైద్యం ఇవ్వాలని, డయాలసిస్ విభాగంలో అవసరమైన ఏ సీ లు, ఫ్యాన్లు, మరి ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఆసుపత్రి సూపరింటెండెంట్‌కి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఎన్.బి.కె. ఫ్యాన్స్ అసోసియేషన్ కన్వీనర్ నం బూరి సతీష్, టీడీపీ నాయకులు సుమో సేనా పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్ పర్సన్ పై 23న అవిశ్వాస తీర్మానం

- ఆలోపు బేసరత్తుగా రాజీనామా చేయాలి ..
- నాలుగేళ్లుగా మా వార్డులో అభివృద్ధి శూన్యం ..
- వైసిపి కౌన్సిలర్ల మండిపాటు ..

**విశాలాంధ్ర,కదిరి :** మున్సిపల్ చైర్ పర్సన్‌పై 23న అవిశ్వాస తీర్మానం ఆలోపు మున్సిపల్. చైర్ పర్సన్ బేసరత్తుగా రాజీనామా చేయాలని వైసీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్ అండ్ బి బంగ్లా లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 14మంది వైసీపీ కౌన్సిలర్లు సమావేశమై మాట్లాడుతూ మున్సిపాలిటీలో 36వార్డులుండగా 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికలలో 31మంది వైసీపీ నుండి గెలుపొందారు.అప్పటి ఎమ్మెల్యే డా. సిద్దారెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్ పర్సన్ గా పరికి నజీ మున్నిసను నియమించారు .అప్పటి ఇప్పటి వరకు తాను కొనసాగుతూ నాలుగేళ్లు గా మున్సిపల్ అభివృద్ధికి పాటు పడకుండా స్వంత నిర్ణయాలతో స్వంత పార్టీ సభ్యులుగా చూడకుండా (వైసీపీ) తీవ్ర ఇబ్బందులు పెడుతుందంటూ ఇప్పటికే 26మంది వైసీపీ కౌన్సిలర్లు సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కు అందచేశారు. అంతే కాకుండా ఈనెల 23న అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నట్లు వారు తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ పార్టీ తరుపున సభ్యత్వం లేని వ్యక్తి కి టికెట్ ఇచ్చారని కొత్త వ్యక్తి అయినప్పటికీ పార్టీ అధిష్టానం మేరకు మద్దతు ఇచ్చామని ఆయన ఇప్పటికి స్వంత పార్టీ మనుషులుగా గుర్తించలేదని అగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికయినా మున్సిపల్ చైర్ పర్సన్ బేసరత్తుగా రాజీనామా చెయ్యాలని కోరారు. లేనిపక్షంలో 23న 30 మందికి తక్కువ కాకుండా హాజరై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టి కొత్త వారికి అవకాశం కల్పించి మున్సిపాలిటీ అభివృద్ధికి పాటుపడుతామని వారు తెలిపారు.పట్టణంలో మున్సిపల్ చైర్ పర్సన్ మార్పు విషయంలో ఏమి జరుగు తుందోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

## ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి..

**విశాలాంధ్ర-ధర్మవరం:** ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గురువారం నేషనల్ యూనిటీ అసోసియేషన్ నాయకులు ధర్మవరం డిపో ఎదుట రీజినల్ నాయకులు మోహన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం జోనల్ నాయకులు ఏ ఎస్ రావు, రీజినల్ నాయకులు జి వై.నాగప్ప ,దుర్గాప్రసాద్, డిపో గ్యారేజ్- అధ్యక్ష ,కార్యదర్శులు కుమార్ ,హరి మాట్లాడుతూ ఉద్యోగ భద్రత సర్కులర్‌ను వెంటనే అమలు చేయాలని, అక్రమ సస్పెండ్ లను, రిమూవులను వెంటనే ఆపాలని తెలిపారు. ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధించాలని, గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ కొరకు సెలవులను మంజూరు చేయాలని తెలిపారు. నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన పదోన్నతులను వెంటనే చేపట్టాలని, ఎలక్ట్రికల్ బస్సులు ప్రభుత్వం ద్వారా గాని సంస్థ ద్వారా గాని కొనుగోలు చేయాలి అని తెలిపారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓడి డ్యూటీలు కేటాయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో నాయకులు హనుమాన్, మధు, ప్రభాకర్, వైవియన్ రెడ్డి ,ఖాన్, గోపాల్ ,మంజునాథ్, మహిళా నాయకురాలు కోమలాదేవి, జాన్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యనందించడమే ప్రభుత్వ ధ్యేయం

### - డీఈఓ కృష్ణప్ప

**విశాలాంధ్ర -పుట్టపర్తి:** కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా విద్యాశాఖ అధికారి కృష్ణప్ప తెలిపారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని గోకులం ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక విద్యాశాఖ అధికారితో కలిసి పాఠశాలలో ఇటీవల తిరిగి పాఠశాలలో చేరిన విద్యార్థుల వివరాలు పరీక్షలు జరుగుతున్న తీరు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పాఠశాలను ఆదర్శ ప్రాథమిక పాఠశాలగా మారుస్తున్నామని తరగతికి ఒక ఉపాధ్యాయులు ఉంటారన్నారు. గతంలో చదువు మానేసి బయట ఉన్న విద్యార్థులను ఎక్కువ మందిని చేర్పించి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచినందుకు ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులను అభినందించారు. విద్యార్థులతో అభ్యాసన సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యాశాఖ అధికారులు ఖాదర్ వలీ, ప్రసాద్, సాయినాథ్ శర్మ, ఉపాధ్యాయులు రాధా రాణి, పివి రమణారెడ్డి పాల్గొన్నారు.

## వేల పాల లేని విద్యుత్ కోతలు

**విశాలాంధ్ర-పుట్టపర్తి:**

వేసవిలో వేలాపాలలేని విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత 15 రోజుల నుంచి రాత్రి 10 గంటల తర్వాత విద్యుత్ కోత విధించడంతో వృద్ధులు చిన్నారులు ఉక్కపోతతో సతమతమవు తున్నారు. రాత్రి పూట పూర్తిగా సరఫరా నిలిపివేస్తూ ఉదయం 6 గంటలకు విడుదల చేస్తున్నారు. పగలు కూడా ఎప్పుడు విద్యుత్ ఉంటుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. వేసవిలో కరెంటు సక్రమంగా సరఫరా చేయాలని ప్రజాప్రతి నిధులు చెబుతున్నారే తప్ప అమలు కావడం లేదన్నారు. వ్యవసాయానికి కూడా కరెంటు తిప్పలు తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకేసారి పగలు 9 గంటలు సరఫరా చేస్తే ఉపయోగం ఉండదని రైతులు చెబు తున్నారు. రాత్రిపూట పొలాల్లో కరెంటు కోసం ఎదురుచూసే పరిస్థితి నెలకొంది అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరుతున్నారు.

## మెగా డీఎస్సీకి ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ

**విశాలాంధ్ర-హిందూపూరం :** వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంచాలకులు విజయవాడ వారి ఆదేశాల మేరకు మెగా డి.యస్.సి. పరీక్షకు ఆన్-లైన్ ద్వారా త్వరలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. టెట్‌లో అర్హత సాధించిన జిల్లా వాసులు బి.సి, ఈడబ్ల్యూఎస్ (ఈబిసి) కేటగిరీలకు చెందిన అభ్యర్థుల నుంచి మాత్రమే ఉచిత ఆన్-లైన్ శిక్షణకు దరఖాస్తులు స్వీకరించబడును. టెట్ పరీక్షల మార్కుల ఆధారంగా ఎంపిక చేయబడుదురు. టెట్ పరీక్షలో అర్హత సాధించిన మార్కుల పత్రం నేటివిటీ పత్రము, కుల ధృవీకరణ పత్రం ఆదాయ ధృవీకరణ పత్రం ఆధార్ కార్డు 2 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు జతపరచి వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిత అధికారి వారి జిల్లా కార్యాలయంలోను, దరఖాస్తులు అందజేయవలెను. ఏప్రిల్ 15 వరకు ఈ దరఖాస్తు పత్రాలను కార్యాలయం నుండి పొందవచ్చు.

## నేత్రదానం చేసిన పూజారి వెంకటరాముడు..

**విశాలాంధ్ర -ధర్మవరం :** పట్టణంలోని గాంధీ నగర్ లో నివసించు పూజారి వెంకటరాముడు అకస్మాత్తుగా మృతి చెందడం జరిగింది. దీంతో వారి కుమారులు పూజారి జగదీష్, పూజారి గిరిధర్, అన్న పూజారి నారాయణ, కుటుంబ సభ్యులు నేత్రదానం చేయాలనుకుని యువర్స్ ఫౌండేషన్ సంస్థకు సమాచారాన్ని అందించారు. దీంతో సమాచారం అందుకున్న యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు షీలా నాగేంద్ర, డాక్టర్ సుబ్బారావు, మాజీ అధ్యక్షులు వైకే శ్రీనివాసులు, రెడ్ క్రాస్ టెక్నీషియన్ రాఘవేంద్ర, భాస్కర్, టెక్నీషియన్ సికిందర్ అక్కడికి చేరుకొని కుటుంబ సభ్యుల అంగీకారమేరకు నేత్ర సేకరణ చేయడం జరిగింది. తదుపరి ఆ కుటుంబ సభ్యులకు యువర్స్ ఫౌండేషన్ సంస్థ కృతజ్ఞతలను తెలియజేసింది. అనంతరం వారు మాట్లాడుతూ నేత్రదానం అనేది చాలా ఆదర్శవంతమైనదని తెలిపారు. నేటి సమాజంలో ఎంతోమంది చూపు లేక బాధపడుతున్న వారికి వారి జీవితాల్లో వెలుగులు నింపుతాయని తెలిపారు. ఎంతోమంది ఆదర్శంగా నేత్ర ధానముకు సహకరించడం మాకెంతో సంతోషంగా ఉందని వారు తెలిపారు.

## ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన ..

**విశాలాంధ్ర-ధర్మవరం :** పట్టణంలోని ఎస్బిఐ కాలనీలో ఉంటున్న మానస నృత్య కళాకేంద్రం 15 మంది శిష్య బృందం సోమందేపల్లి సమీపంలోని గుడిపల్లి గ్రామం నందు రంగనాథ స్వామి దేవస్థానం స్వామివారి కల్యాణ బ్రహ్మోత్సవాల వైభవంగా తిరుప్పాడ సేవలో భాగంగా ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ప్రసిద్ధ నాట్య గురువు రంగాచార్యులు, దేవస్థానం పురోహితుల చేతులమీదుగా గురువు మానసను ఘనంగా సన్మానించారు. అమ్మవారికి అలంకరించే చీరను మానసకు బహుకరించారు. గురువు మానస మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలను, కళ లను ఇనుమడింప చేయడమే మా లక్ష్యమని వారు తెలిపారు.

## క్షయ వ్యాధిపై ఇంటింటా సర్వే..

**విశాలాంధ్ర -ధర్మవరం :** మండల పరిధిలోని దర్శనమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏలుకుంట్ల గ్రామంలో యాక్టివ్ టీవీ కేస్ ఫైండింగ్ లో భాగంగా డబుల్హెచ్ఓ.కన్సలెంట్ డాక్టర్.జీఎస్. ప్రశాంత్ క్షయ వ్యాధిపై ఇంటిట సర్వే నిర్వహించారు. గ్రామస్తులకు క్షయ వ్యాధి లక్షణాలు వాటి నివారణ పై అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించిదగ్గు ఉండడం, సాయంత్రం పూట జ్వరం రావడం, బరువు తగ్గిపోవడం, ఆకలి లేకపోవడం లాంటివి క్షయ వ్యాధి లక్షణాలు అని తెలిపారు. ఈ లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వారి గళ్ళ నమూనాలను సేకరించి పరీక్ష కేంద్రానికి పంపుతామని చెప్పారు. జిల్లా జయ పర్యవేక్షకులు మల్లికార్జున, నాగేంద్ర, ఆంజనేయులు, హెల్త్ సూపర్వైజర్ రాజశేఖర్‌రెడ్డి, ధర్మవరం సూపర్వైజర్ రహమత్ భాష, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

## తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డిపై కేసు నమోదు

**విశాలాంధ్ర-రామగిరి :** రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డిపై రామగిరి పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటన వేళ పోలీసుల బందోబస్తీ లో భాగంగా వైసీపీ కార్యకర్తల తోపులాటలో గాయపడిన కానిస్టేబుల్ నరేంద్ర కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. కార్యకర్తలను రెచ్చగొట్టడం, హెలిపాడ్ చుట్టూ బారికేడ్ల ఏర్పాటులో తోపుదుర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించారని కానిస్టేబుల్ ఫిర్యాదులో పేర్కొన్నారు అని రామగిరి పోలీసులు తెలియజేశారు.

## ఏపీజీ బ్యాంకు ప్రారంభం

**విశాలాంధ్ర-నంబులపూలకుంట:** మండల కేంద్రంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు నూతన భవనాన్ని ఆ బ్యాంకు జనరల్ మేనేజర్ సంజీవప్ప గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బ్యాంకు నందు ప్రజల నుండి 44 కోట్ల రూపాయల డిపాజిట్లు సేకరించామని,92 కోట్లు రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని,తమ బ్యాంకు లో చేసిన డిపాజిట్లకు అధిక వడ్డీని అందిస్తున్నట్లు తెలిపారు. ఖాతాదారులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి తోడ్పడాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో కదిరి రీజనల్ మేనేజర్ రమేష్,మేనేజర్ పిచ్చయ్య,బ్యాంకు సిబ్బంది,ఖాతాదారులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ

**విశాలాంధ్ర పుట్టపర్తి:**-ప్రభుత్వ ఆదేశాల మేరకు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ పరీక్షలకు ఆన్ లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మల జ్యోతి గురువారం ప్రకటన లో తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టి, ఈ డబ్ల్యూ ఎస్ కేటగిరీలకు చెందిన అభ్యర్థులకు ఆన్ లైన్ లింకు ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. టెట్ పరీక్షలలో అర్హత సాధించిన సత్యసాయి జిల్లా వాసులు మాత్రమే అర్హులన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా వెనుకబడిన సంక్షేమ శాఖ అధికారి వారి కార్యాలయంలో గాని, సెల్ నెంబర్ 9392141545 కు ఫోన్ చేసి సంప్రదించవచ్చని డిడి తెలిపారు.

## బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే వారిపై చర్యలు తీసుకోండి

**విశాలాంధ్ర-చిలమత్తూరు :** మండలంలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకోవాలని సుందరయ్య కాలనీ ప్రజలు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్ఐ మునీర్ అహ్మద్‌కు ఫిర్యా దు చేశారు. కాలనీవాసులు మాట్లాడుతూ చిలమత్తూరు కొడికొండ చెక్‌పోస్ట్ సమీపంలో గల సుందరయ్య కాలనీలో రాత్రి వేళల్లో కాలనీ ప్రక్కన బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. అంతేకాక సోమవారం రాత్రి కాలనీలో విలువైన వస్తువులను ధ్వంసం చేశారని తెలిపారు.

## పోషణ పక్వాడ్‌పై అవగాహన కార్యక్రమం

**విశాలాంధ్ర -బుక్కపట్నం :** మండల కేంద్రంలోని 3వ అంగన్వాడి సెంటర్ ఏడవ పోషణ పక్వాడ్ కార్యక్రమంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. పీడీ శ్రీదేవి మాట్లాడుతూ పోషణ పక్వాడ్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ఒక గర్భవతి నుంచి బిడ్డ పుట్టి రెండేళ్లు నిండెంత వరకు బిడ్డ పెరుగుదల వేగంగా ఉంటుందని ఈ వెయ్యి రోజుల సమయంలో పిల్లలకు మంచి పౌష్టికాహారం, మంచి సంరక్షణ అందించాలని తెలిపారు. పిల్లలకు జంక్ ఫుడ్ వద్దని, పిల్లల సంరక్షణ పై గర్భిణులకు, అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ కౌసల్య, అంగన్వాడి టీచర్లు నాగమణి, జ్యోతి పాల్గొన్నారు.

## ఆరోగ్య సంరక్షణ పట్ల శ్రద్ధ వహించాలి

**విశాలాంధ్ర-కదిరి టౌన్ :** ఆరోగ్య సంరక్షణ పట్ల గర్భిణీ స్త్రీలు శ్రద్ధ వహించాలని కదిరి ప్రాజెక్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత పేర్కొన్నారు. గురువారం కదిరి అమీన్ నగర్ ఒకటోవ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన ఆరోగ్యం సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు.

గర్భిణీ స్త్రీలు సమతుల్య ఆహారం తీసుకోవాలని, సమతుల్య ఆహారంలో ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు, కొవ్వులు, విటమిన్లు ఖనిజాలు ఉండాలని తెలియజేసారు. పండ్లు, కూరగాయలు, బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవలన్నారు. తగినంత నీరు తీసుకుంటూ. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.

## ఆకట్టుకున్న పోతురాజు ఉత్సవం

**విశాలాంధ్ర -గుడిబండ :** మండల కేంద్రంలో గత నాలుగు రోజులుగా శ్రీ తుమ్మల మారమ్మ దేవి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం 5గంటల సమయంలో వేలాది మంది భక్తుల నడుమ తుమ్మల మారమ్మదేవికి శ్రీ పోతురాజు స్వామి నాట్య ప్రదర్శన చేశారు. మండలంలోని ప్రజలకు అష్ట ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని పురోహితులు విశేష పూజలు నిర్వహించినట్లు స్థానిక సర్పంచ్ కరుణాకర్ గౌడ్ తెలిపారు. స్థానిక నాయకులు జి.బి శివకుమార్, దుర్గేష్,ఎంపీటీసీ వనజ శశిధర్, మాజీ ఎంపీపీ ఎల్.కె నరసింహప్ప, శ్రీరామప్ప, అమ్మవారి దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బంగారు గొలుసు అపహరణ

**విశాలాంధ్ర- చిలమత్తూరు :** కొడికొండ చెక్ పోస్ట్ చిల్లర దుకాణంలో ఉన్న ఇందిరమ్మ అనే మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ జరిగింది.ద్విచక్ర వాహనంలో వచ్చిన ఇద్దరు అటు ఇటు తిరుగుతూ ఒక్కసారిగా వచ్చి కూల్ డ్రింక్ కావాలని అడిగి ఆమెను బెదిరించి మెడలో 3.5 గ్రాముల బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారు. కుటుంబీకులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు, ఎస్సై మునీర్ అహ్మద్ సీసీ ఫుటేజీలు పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## 6 వ తరగతి ప్రవేశానికి 21న పరీక్షలు

**విశాలాంధ్ర-అగళి :** స్థానిక ఆదర్శ పాఠశాలలో 6 వ తరగతి ప్రవేశానికి ఈనెల 21 న పరీక్షలు నిర్వహిస్తునట్లు ప్రిన్సిపాల్ జాఫర్ తెలిపారు.ప్రవేశానికి గతంలో 20 న పరీక్షలు ఉంటాయని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. కాని 20 న ఇష్టార్ పర్వదినం కావడం తో 21 న ప్రవేశ పరీక్షలు ఉంటాయన్నారు.

## మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌కు సన్మానం

**విశాలాంధ్ర-రొళ్ల:-** నూతన మార్కెట్ డైరెక్టర్ ఎస్.ఎన్ మీనాక్షి ముద్దరాజును గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పతాంజలి యోగ శిక్షణ సమితి రిజిస్టర్ రొళ్ల శాఖ వారి ఆధ్వర్యంలో శాలువతో ఘనంగా సత్కారించారు. ఎమ్. ముద్దరాజు మాట్లాడుతూ మండలవాసులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తానని తెలియజేశారు. యోగా శిక్షణ సభ్యులు పాల్గొన్నారు..

## టీడీపీ నాయకులకు ఏజెంట్ లా రామగిరి ఎస్సై తీరు

**విశాలాంధ్ర -మడకశిర :** సాధారణంగా ఏ పోలీస్ అధికారి అయిన న్యాయం పట్ల గౌరవంతో అన్యాయం చేసిన వ్యక్తులను చట్టం ముందు దోషులుగా నిలబెడతారు.అయితే రామగిరి ఎస్సై సుధాకర్ యాదవ్ మాత్రం పోలీసు వ్యవస్థకే మచ్చ తెచ్చే విధంగా టిడిపి నాయకులు ఏమి చెబితే అదే శాసనంగా రామగిరి మండలంలో టిడిపి వాళ్లకు ఏజెంట్ లా ప్రవర్తిస్తున్నారని సత్య సాయి జిల్లా వైయస్ఆర్సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు నరసింహమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తిని ఏక వచనంలో సంబోధిస్తూ జగన్మోహన్ రెడ్డి మీద సవాల్ విసరడం ఆశ్చర్యం కలిగిస్తోందని.. జగన్మోహన్‌రెడ్డి మాటలను తప్పుబట్టే సుధాకర్ యాదవ్‌కు గతంలో చంద్రబాబు నాయుడు పోలీసులపై చేసిన ఘాటు వ్యాఖ్యలను ఎందుకు ఖండించలేదో ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు.టిడిపి నాయకుల మెప్పు పొందేందుకు అన్ని విధాల ప్రయత్నిస్తున్నారని ఇలాంటి పరిస్థితి కొనసాగిస్తే భవిష్యత్తులో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గుణపాఠం తప్పకుండా ఉంటుందని హెచ్చరించారు.వెంటనే జగన్మోహన్ రెడ్డికి క్షమాపణలు చెప్పి సుధాకర్ యాదవ్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఊరి బాధ్యత మనదే

**అధికారుల నిర్లక్ష్యం వల్లే కనుమరుగవుతున్న ఆర్టీసీ బస్టాండ్**

**నీలం సంజీవరెడ్డి సర్కిల్ సాక్షిగా నిలువెత్తు నిర్లక్ష్యం**

**విశాలాంధ్ర - గార్లదిన్నె :** మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో నిత్యం ప్రజారవణకు ఉపయోగపడవలసినటు వంటి ఆర్టీసీ బస్టాండ్ షల్టర్ కొందరు స్వార్ధపరులు అవసరాల కోసం టీ స్టాల్ గా మారి అందులోనే టిఫిన్ సెంటర్ అంటూ భోజన హోటల్ అంటూ ఆర్టీసీ బోర్డు కూడా కనపడకుండా పెద్ద అక్షరాలతో వారి సొంత వ్యాపార నిమిత్తం ఆర్టీసీ బస్టాండ్ ను వినియోగించుకోవడం చాలా బాధాకరం. ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణమని పెద్ద పెద్ద అక్షరాలతో బస్సు షెల్టర్ పై రాసి ఉన్నప్పటికీ దానిని టీ స్టాల్కు బాడుగకు ఇచ్చింది 10,10 కొలతల వారీగా ఇవ్వగా వీరు స్వార్ధం కోసం బస్టాండ్ మొత్తం ఆక్రమించుకున్నారు . దీనిపై గతంలో పలు పత్రికలలో మీడియా కథనాలు వెలువడినప్పటికీ ఆర్టీసీ ఉన్నత అధికారులలో ఎటువంటి చలనం లేకపోవడం ఆర్టీసీ యాజమాన్యం నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. కొందరు ప్రజాప్రతినిధులు మరియు పత్రిక విలేకరులు ఆర్టీసీ డిపో మేనేజర్ ను ఈ విషయంపై సంప్రదించగా ఆయన నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్టు పలువురు ప్రజాప్రతినిధులు తెలియజేస్తున్నారు. గ్రామంలో ప్రతినిత్యం కళాశాలకు వెళ్లే విద్యార్థులు వయోవృద్ధులు మరియు ప్రయాణికులు బస్ షెల్టర్ లేక సంజీవరెడ్డి సర్కిల్లో నిల్చుని అనేక ఇబ్బందులు పాలవుతున్నారు. పలుమార్లు చిన్నచిన్న ప్రమాదాలు జరిగిన దాఖలాలు కూడా లేకపోలేదు. ప్రజల కోసం ఉపయోగపడవలసిన బస్సు షెల్టర్ ను వారి ఆర్థిక ప్రయోజనాల కోసం వినియోగించుకుంటూ ప్రయాణికులను ఎండ కడుతున్నారని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినటువంటి ఆర్టీసీ అధికారుల వైఖరి పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకొని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాన్ని ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించే విధంగా బస్సు షెల్టర్ను ఏర్పాటు చేసి ప్రజలకు అందివ్వాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## కార్మికులపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం విడాలి

**శ్రీరామిరెడ్డి కార్మికులు గడ్డి తింటూ వినూత్న నిరసన**

**విశాలాంధ్ర - కళ్యాణదుర్గం టౌన్ :** పట్టణంలో స్థానిక శ్రీరామిరెడ్డి త్రాగునీటి పంప్ హౌస్ వద్ద శ్రీరామిరెడ్డి కార్మికుల సమ్మె ఐదవ రోజు గురువారం కొనసాగుతున్నది.అందులో భాగంగా కార్మికులు, సిఐటియూ నాయకులు గడ్డి,ఆకులు తింటూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ మాట్లాడుతూ కార్మికులు సమ్మె చేపట్టి ఐదు రోజులు కావస్తున్న కూటమి ప్రభుత్వం, అధికారుల్లో మాత్రం చలనం రావడం లేదు. నామ మాత్రంగా జీతాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడమే తప్ప ఆచరణలో కనిపించడం లేదన్నారు.తినడానికి తిండి లేకుండా పోయిందని అందుకే గడ్డి తింటూ బ్రతికే పరిస్థితులను ప్రభుత్వం కల్పించిది కార్మికుల ప్రభుత్వంకు కార్మికులపై కనీసం కనికరం లేకుండా పోయిందన్నారు.కాంట్రాక్టర్ కడుపు నింపుతూ కార్మికుల పొట్టకొడుతున్న ఈ కూటమి ప్రభుత్వంపై ప్రజలందరూ అసహనం వ్యక్తం చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ మండల కార్యదర్శి రంగనాథ్, ఎస్ఎఫ్ఐ నాయకుడు భవిత్,శ్రీరామిరెడ్డి యూనియన్ కోశాధికారి వన్నూరు స్వామి తాలూకా అధ్యక్షుడు పి.నరేష్,అల్లాబకస్, చిత్తప్ప,గురుమూర్తి,జి.వెంకటేశులు,మురళిలు పాల్గొన్నారు.

### ఉచిత పాఠ్యపుస్తకాలు అందజేత

**విశాలాంధ్ర - ఉరవకొండ :** ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గురువారం ఉచిత పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మమత మాట్లాడుతూ ఏప్రిల్ ఒకటి నుంచే ఇంటర్ ద్వితీయ సంవత్సరం క్లాసులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని సౌకర్యాలను వినియోగించుకోవాలన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు పుస్తకాలు చదవడం మరియు సబ్జెక్టు మీద అవగాహన పెంచుకోవాలని సందేహాలు ఉంటే అధ్యాపకులతో చర్చిం చాలని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఇంటర్ మొదటి సంవత్సరంలో విద్యార్థులను చేర్పించాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విద్యార్థుల భవిష్యత్తు కోసం విద్యాలయాల్లో సమకూరుస్తున్న వివిధ ఉచిత వసతులను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ తెలిపారు. పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు కళాశాలలో పేరు నమోదు చేసుకోవాలని. నమోదు చేసుకున్న విద్యార్థులకు వివిధ బ్రిడ్జ్ కోర్సులు బోధిస్తున్నామని వీటిని కూడా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

### పవన్ కళ్యాణ్ చిన్న కుమారుడు త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు

**విశాలాంధ్ర - హిందూపురం :** జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ సింగపూర్ లోని స్కూల్ లో అగ్నిప్రమాదంలో గాయపడటం చాలా దురదృష్టకరమని, ఆపదలో ఉన్న కొన్ని లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపిన పవన్ కళ్యాణ్ కుమారునికి ఇలా జరగటం చాలా బాధాకరమని, మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని, హిందూపురం జనసేన పార్టీ ఆధ్వర్యంలో బుధవారం సుగూరు ఆంజనేయ స్వామి దేవాలయంలో 101 టెంకాయలు కొట్టారు. అలాగే అయ్యప్ప స్వామి గుడిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇంచార్జ్ ఆకుల ఉమేష్, హిందూపురం మండల, పట్టణ అధ్యక్షులు చక్రవర్తి, కొల్లకుంట శేఖర్, జనసేన పార్టీ నాయకులు నిమ్మకాయల రాము, బొంచేరువు భాస్కర్, చలపతి, విజయ్ కుమార్, మణి ప్రియ, అంబేద్కర్ నగర్ శివ, మనోహర్, హనుమంతు, లింగరాజు, మౌలినాథ్, మణి తోపాటు తదితరులు పాల్గొన్నారు.

### ఆలయంలో ఎనిమిదవ వార్షికోత్సంలో బొంబాయి

**విశాలాంధ్ర -యాడికి :** మండల కేంద్రంలోని చందన రోడ్డు లో గల శ్రీ రాములమ్మ దేవాలయంలో అమ్మ వారిని ప్రతిష్టించి 8వ సంవత్సరాలు పూర్తి అయినా సందర్భంగా గురువారం అమ్మవారి ఆలయంలో వైస్సార్సీపీ సీనియర్ నాయకులు బొంబాయి రమేష్ నాయుడు, ఉపసర్పంచ్ కాసా చంద్రమోహన్ ప్రత్యేక పూజా కార్యక్రమానికి హాజరయ్యారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రంగనాయకులు, రామరాజు, కర్ణాకర్, వార్డ్ సభ్యులు గజ్జి బాలపెద్దయ్య, బేల్దారి మైసూర్ కుళ్లాయప్ప, భక్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు

### రూపా నాయక్ తండాలో చైత్రమాసం పూజలు

**విశాలాంధ్ర-ఉరవకొండ :** వజ్రకరూరు మండలం రూపానాయక్ తండాలో గురువారం చైత్రమాసం పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బంజారా సంఘం నేత నంగరేయర్ నాయక్,ఎస్ కే. సుబ్రహ్మణ్యం నాయక్ మాట్లాడుతూ నేటి సమాజంలో ఆధ్యాత్మిక చింతన ఎంతైనా అవసరమని ప్రతి ఒక్కరు కూడా ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని తెలిపారు. రూప నాయక్ తండాలో ఆనవాయితీ ప్రకారం బంజారాల సాంప్రదాయం పద్ధతులు చైత్రమాసంలో పూజలు నిర్వహించమన్నారు. అనంతరం అన్న సేవా కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బంజారా సంఘం నేతలు ఎస్.కె కేశవ నాయక్, దాసు నాయక్, మాజీ జెడ్పిటిసి తులసీదాసు నాయక్, ఎం నాణ్య నాయక్, బంగి హేమ నాయక్ ఉమాపతి నాయక్లు పాల్గొన్నారు.

### ఒకేషనల్ విద్య కోర్సులతో నైపుణ్య అభివృద్ధి

**విశాలాంధ్ర - అగళి :** ఒకేషనల్ విద్య కోర్సులు ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించి, పరిశ్రమలో తక్షణ ఉపాధికి మార్గాలు లభిస్తాయని మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ జాఫర్ తెలిపారు.స్థానిక ఏపీ మోడల్ పాఠశాలలో ఒకేషనల్ విద్యార్థులు బ్యూటీ,వెల్నెస్, ఐటి ట్రేడ్ లో భాగంగా పది రోజులపాటు ఇంటర్ షిప్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ ఇంటర్ షిప్ ప్రోగ్రామ్ మండలంలోనీ బ్యూటీ పార్లర్ లేడీస్ కార్నర్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు బ్యూటీ లేడీస్ కార్నర్ సంబంధించిన ప్రత్యక్ష అవగాహన, నైపుణ్యం పొందిన వారిచే శిక్షణ కల్పించారు.అలాగే ఐటీ ట్రేడ్ ఉన్నా పలు షాపులను సందర్శించారు. మీసేవ, ఇంటర్నెట్ సెంటర్, ప్రింటింగ్ ప్రెస్, మొబైల్ హార్డ్ వేర్,మొదలగు వాటిపై సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా నైపుణ్యం పొందుతున్న విద్యార్థులను శ్రీ సత్య సాయి జిల్లా వొకేషనల్ కోఆర్డినేటర్ కృష్ణ చైతన్య పరిశీలించారు.విద్యార్థులతో చర్చించి వారు నేర్చుకుంటున్న నైపుణ్యాలు పార్లలలో సెంటర్లలో చేసే పనులపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వొకేషనల్ ట్రైనర్స్ ఆర్. నాగరత్నమ్మ చంద్రబాబు నాయుడు పర్యవేక్షణలో సజావుగా కొనసాగింది. విద్యార్థులు తమ ప్రాక్టికల్ అనుభవాన్ని పంచుకొంటూ ఈ అవకాశాన్ని కల్పించిన ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మహమ్మద్ జాఫర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఇంటర్ షిప్ ప్రోగ్రాం లో పదవ తరగతి ఇంటర్ ఫస్టియర్ సెకండియర్ విద్యార్థులు పాల్గొన్నారు.ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మహమ్మద్ జాఫర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులలో నైపుణ్యాలు పెంపొందించి, పరిశ్రమలో తక్షణ ఉపాధికి మార్గం వేస్తాయని తెలిపారు.

## అటహాసంగా డాక్టర్ హనెమాన్ జయంతి వేడుకలు

**విశాలాంధ్ర - అనంతపురం :** ప్రపంచ మానవాళికి దుష్ప్రభావం లేని నమ్మకమైన వైద్యం అందించిన డాక్టర్ హనెమాన్ 270వ జయంతి వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. గురువారం స్థానిక సప్తగిరి సర్కిల్ లోని బల్ల కాన్ఫరెన్స్ హాల్లో రాష్ట్రీయ మెడికల్ ఆయుష్ అసోసియేషన్ (రామ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డాక్టర్ పోగుల కుమారయ్య అధ్యక్షత వహించారు. రామ సదరన్ స్టేట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ వీరబోయిన నాగేశ్వరరావు విశిష్ట అతిథిగా హాజరయ్యారు. డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు సమన్వయం చేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ నాని నవోమి ఆలపించిన పాట ఎంతగానో ఆకట్టుకుంది. చిన్నారి శ్రీనిధి చేసిన యోగాసనాలు అబ్బురచాయి. శ్రీనివాస డయాగ్నస్టిక్ సెంటర్ వారు ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవగా భావించి ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని హోమియోపతి వైద్య విధానాన్ని కనుగొన్న మహోన్నత వ్యక్తి డాక్టర్ హనెమాన్ అని కొనియాడారు. అలోపతి వైద్యానికి ఆయుష్ వైద్యానికి ఉన్న వ్యత్యాసం గురించి చక్కగా వివరించారు. హోమియోపతి నమ్మకమైన వైద్యమని.. వైద్యం పట్ల ప్రజల్లో మరింత చైతన్యాన్ని పెంపొందించేందుకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డాక్టర్ పోగుల కుమారయ్య, తిరుపతి నాయుడు లు పిలుపునిచ్చారు. అనంతరం విశిష్ట అతిథి డాక్టర్ వీరబోయిన నాగేశ్వరరావు, రామ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పోగుల కుమారయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తిరుపతి నాయుడు, డాక్టర్ శాంతిప్రియ లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ శాంతి ప్రియ రాష్ట్ర మహిళా విభాగం కోఆర్డినేటర్, డాక్టర్ ఎన్. ఏ ఎన్.మాలిక్, డాక్టర్ పోగుల నాగేంద్రబాబు, డాక్టర్ శ్రీనివాస నాయక్ జిల్లా అధ్యక్షులు, డాక్టర్ చంద్రమౌళి జిల్లా ఉపాధ్యక్షులు, డాక్టర్ మురళీకృష్ణ జిల్లా ట్రెజరర్, డాక్టర్ షేక్షావలి, డాక్టర్ నరసింగరావు, డాక్టర్ వీక్షిత.జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్స్, జిల్లా నాయకులు డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ నజీమ్, డాక్టర్ వనిత. డాక్టర్ ఆనంద్. డాక్టర్ మమత. డాక్టర్ హర్ష ప్రసాద్. డాక్టర్ నాగరాజు. డాక్టర్ అమృత తదితరులు ప్రసంగించారు. సీనియర్ సిటిజన్ ఫోరం జిల్లా అధ్యక్షులు, రమణ, శ్రీ ప్రణవ లీల రాజ్య లక్ష్మమ్మ ఆశ్రమము అధ్యక్షులు, పరుచూరి సూర్యప్రకాశరావు, పీజీ నాగభూషణం, సూర్యనారాయణ, మారుతి, రామ సుబ్బన్న, కోటిరెడ్డి, అల్లా బకాస్, సద్గురు పీఠం సేవా కేంద్రం సభ్యులు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలి

**ప్రతి కార్యకర్త బాధ్యతగా పని చేయాలి**

**బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖామంత్రి సవితమ్మ**

**విశాలాంధ్ర - గోరంట్ల :** గ్రామ స్థాయిలో తెలుగుదేశం పార్టీ (టిడిపి) బలోపేతం చేసేందుకు కమిటీల నిర్మాణం అత్యవసరమని మంత్రి సవితమ్మ అన్నారు, గోరంట్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల టీడీపీ,నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో కుటుంబ సాధికార సారధుల నియామకం ఎంత ముఖ్యమో వివరించారు. ఏప్రిల్ 15వతేదీ లోపు కుటుంబ సాధికార సారధుల నియామకం పూర్తి చేయాలని అని తెలిపారు. పార్టీ బలోపేతానికి గ్రామ స్థాయి నుంచి మండల స్థాయికి వ్యూహాత్మకంగా కార్యాచరణ రూపొందించాలని సవితమ్మ అన్నారు, పార్టీకి కార్యకర్తలే అసలైన బలం. స్థానికంగా టిడిపి మరింత బలోపేతం కావాలంటే, ప్రతి ఒక్కరు తమ బాధ్యతను నిర్వర్తించాలన్నారు, ప్రతి గ్రామంలోనూ, ప్రతి బూత్ స్థాయిలోనూ టిడిపి శ్రేణులు సమర్థవంతంగా పని చేయాలని కోరారు,కుటుంబ సాధికార సారధుల నియామకం ద్వారా గ్రామ స్థాయిలో మరింత బలమైన నేతలను సమకూర్చుకోవాలన్నారు. ప్రభుత్వ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత మనపై ఉందని, ప్రతి కార్యకర్త ప్రజల సమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని మంత్రి సవితమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొల్లకుంట అంజనప్ప, మండల కన్వీనర్ సోమశేఖర్, పట్టణ కన్వీనర్ రఘునాథ్ రెడ్డి, మాజీ సర్పంచ్ సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ నరేష్ కుమార్, నిమ్మల శ్రీధర్,పచ్చ అశోక్,బాలకృష్ణ చౌదరి, ఉత్తమ రెడ్డి, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గిరిధర్ గౌడ్,బీ రే వేణుగోపాల్ రాయల్, జయరామ్, రాజారెడ్డి,సర్పంచ్ సరోజ నాగే నాయక్,కట్టుబడి అంజి,చంద్ర, అశ్వర్థ రెడ్డి ,రుద్ర, తో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ : డీసీహెచ్ఎస్

**విశాలాంధ్ర - కనేకల్ :** కనేకల్ పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి నందు రాష్ట్ర వైద్య విధాన జిల్లా పరిషత్, డాక్టర్ ,పాల్ రవికుమార్ అకస్మాత్తు తనికి నిర్వహించారు. ఆసుపత్రి నందు వివిధ భాగాల్లో వైద్యులను సిబ్బందిని పనితీరును పరిశీలించారు. అనంతరం వైద్యులు సిబ్బందితో కలిసి మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పత్రికల్లో వచ్చిన ఫిర్యాదు పైన ఇక్కడకు వచ్చి తనిఖీ నిర్వహిస్తున్నామని వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఎంతోమంది రోగగ్రస్తులు ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. అందుకే వైద్యులు సిబ్బందిని హెచ్చరించి అందరూ సమయ పాలన పాటించాలన్నారు. తరువాత ఆసుపత్రి రికార్డులను పరిశీలించామని అలాగే వైద్యులు విధులలో భాగంగా రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు, ప్రజాసేవలో వైద్యం అనేది చాలా ముఖ్యమైనది. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు గుర్తింపు నమోదు చేయాలన్నారు, డ్యూటీ 24 గంటలు ఏడు రోజుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రజలకు వ్యాధులకు సంబంధించిన ప్రభుత్వాసుపత్రి నందు డాక్టర్స్ పేషెంట్స్ ను సరిగా చూడలేని పక్షంలో వారిని నిర్లక్ష్యం చేసిన వారి పైన మీరు మాకు ఫోన్ చేసిన ఆ వైద్య సిబ్బంది పైన తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలదే ఈ ప్రభుత్వ ఆసుపత్రి అని ప్రజలను వ్యాధిగ్రస్తులను నిర్లక్ష్యంగా మాట్లాడిన వారికి సరైన వైద్యం అందించలేకపోయినా సహించేది లేదని వైద్య సిబ్బంది వారిని హెచ్చరించారు. ఈ ప్రభుత్వ ఆసుపత్రి నందు వ్యాధిగ్రస్తులను ప్రజలను నిర్లక్ష్యం చేసిన వారు ఈ ఫోన్ నెంబర్కు 8008553730కి ఫోన్ చేసి మాట్లాడవచ్చు అని కూడా తెలిపారు.

# పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి

**విశాలాంధ్ర - పుట్టపర్తి:** పెంచిన గ్యాస్ సిలిండర్ల ధరలు తగ్గించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని గణేష్ సర్కిల్ లో సిపిఎం, సిఐటియు నాయకులు గ్యాస్ సిలిండర్లతో ధర్నా నిర్వహించారు. మండే ఎండను సైతం లెక్కచేయకుండా వంట గ్యాస్ సిలిండర్లను భుజంపై నెత్తిన పెట్టుకొని నిరసన తెలిపారు. పెరిగే ధరలకు హద్దే లేదు పెంచే వారికి బుద్దే లేదు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైఖరి నశించాలి, మోడీ డౌన్ డౌన్, సిపిఎం వర్ధిల్లాలి, పెరిగిన ధరలు వెంటనే తగ్గించాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈ ఎస్ వెంకటేష్ మాట్లాడుతూ మార్కెట్లో ఏ వస్తువు కొనలేని పరిస్థితి నెలకొందని ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ధరను నియంత్రించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ ధర పెరిగిపోవడంతో పేదలు ఏమీ కొనలేని తినలేని పరిస్థితి దాపరించిందన్నారు. ఇప్పటికైనా పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ప్రాంతీయ కార్యదర్శి బ్యాళ్ళ అంజి, కొత్తచెరువు కార్యదర్శి ముత్యాలు, వ్యవసాయ కార్మిక సంఘం కోశాధికారి వెంకటేష్, మహిళా సంఘం నాయకులు రమాదేవి, శ్రావణి, భాష తదితరులు పాల్గొన్నారు.

### అంబేద్కర్ జయంతి నిర్వహించుకోవాలి

**విశాలాంధ్ర -పుట్టపర్తి :** ఈనెల 14న డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులముల సంక్షేమం, సాధికారత అధికారి శివరంగ ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన ఒకటవ విడుదల చేస్తూ ఏప్రిల్ 14న నిర్వహించే అంబేద్కర్ జయంతి వేడుకలను మండల స్థాయిలో ఉన్న ప్రతి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో నిర్వహించబడునని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో పుట్టపర్తి పట్టణంలోని ఎనుములపల్లిలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం నందు ఉదయం 10 గంటలకు అంబేద్కర్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, తదితరులచే పూలమాలంకరణ కార్యక్రమం,తదుపరి సమావేశం ఉంటుందని తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు,రాజకీయ నాయకులు, దళిత సంఘాల నాయకులు అందరూ వారికి సమీపంలో ఉన్న ఎస్సీ హాస్టల్ నందు పాల్గొని జయప్రదం చేయాలని శివరంగ ప్రసాద్ కోరారు.

### నశనకోట కోట ముత్యాలమ్మ దేవాలయంలో బలహీనంగా వేలం

**విశాలాంధ్ర - రామగిరి :** శ్రీ సత్య సాయి జిల్లా రామగిరి మండలం శ్రీ నసనకోట ముత్యాలమ్మ దేవత దేవస్థానం నందు గురువారం రూములు, మిశ్రమ బియ్యం, బేడలు మొదలగువాటికి బహిరంగ వేల ము జరపగా మూడు బ్లాకులు రూములకు 32 లక్షల 17000 వేలు రూపాయలు, బియ్యం, బేడలు లకు 12 లక్షల 50 వేల రూపాయలు మొత్తం కలిపి 44,67,000 /- ఆదాయం వచ్చింది. సదురువేలమునకు దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ వన్నూరు స్వామి ఈ ఓ బిఆర్ వెంకటేశులు,నాలుగు గ్రామాల ప్రజలు పాల్గొనడం జరిగినది.

### తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

**విశాలాంధ్ర - గుంతకల్:** పట్టణంలో అంగన్వాడి కేంద్రంలో పౌష్టిక పక్షోత్సవ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమం సిడిపిఓ భారతి ఆదేశాల మేరకు గుంతబావి వీధి అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ పుష్ప ఆధ్వర్యంలో ఏడవ పౌష్టికాహార పక్షోత్సవం కార్యక్రమాలు ఈనెల 8వ తేదీ నుండి 22 వరకు ప్రతి అంగన్వాడి కేంద్రంలో నిర్వహించాలని అంగన్వాడి టీచర్లందరికి తెలియజేస్తు, ప్రతిరోజు కార్యక్రమం నిర్వహించి అందులో భాగంగా మొదటి వెయ్యి రోజుల ప్రణాళిక గురించి బిడ్డకు ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలే ఇవ్వాలని ఆరు నెలలు దాటిన తర్వాత పిల్లలకు అనుబంధ పోషకాహారం మొదలు పెట్టాలని పిల్లల తల్లులకు తెలిపారు ఈ కార్యక్రమానికి గర్భవతులు, బాలింతలు పిల్లల తల్లులు హాజరైనారు అంగన్వాడి టీచర్ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య పరీక్షలు

**విశాలాంధ్ర - ఉరవకొండ :** ఉరవకొండ మండలం రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు ఆరోగ్యపరీక్షలను నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో డాక్టర్ పావని ఆరోగ్య సలహాలు సూచనలను చేశారు. రక్తహీనత నివారణకు సరైన పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆకుకూరలు గుడ్లు మాంసం చేపలు కూరగాయలు విరివిగా తీసుకోవాలని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలకు రావాలని ఇంటివద్ద కాన్పులు సురక్షితం కాదని తెలిపారు. అయోడిన్ కలిగిన ఉప్పు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గర్భిణీ స్త్రీలకు వారి సహాయకులకు ఆరోగ్య సహాయకులు నిమ్మల వెంకటేష్, ముకుందర్ రాఘవేంద్ర స్వామి భోజనం వసతిని కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, వైద్య సిబ్బంది శేఖర్ స్వర్ణలత , జినాతున్నిసా, సునీత భవాని, హిమబిందు, నాగసురేఖ, హెబ్సిబా, రూప పాల్గొన్నారు.

### చిన్నారులకు సమతుల ఆహారం అందించాలి

**విశాలాంధ్ర - యాడికి :** మండల కేంద్రంలోని మార్కెట్ వీధిలో ఉన్న నంబర్ త్రీ అంగన్వాడి కేంద్రంలో పోషన్ పక్వాడలో భాగంగా కే చిన్నారుల తల్లులతో సంబంధిత అధికారులు గురువారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా హాజరైన సీడీపీవో సాజిదా బేగం వెయ్యి రోజుల సంరక్షణ, న్యూట్రిషన్ గురించి తల్లులకు వివరించారు. అదేవిధంగా బిడ్డ ఆకలిని తల్లి గుర్తించి మంచి పోషక విలువలు కలిగిన సమతుల ఆహారం అందించాలని అన్నారు. దీంతో పాటు ముర్రుపాలు బిడ్డకు బలం చేకూర్చుతాయన్నది తల్లులు మరవరాదని తెలిపారు. చిరు ధాన్యాలు మరువకూడదని కూడా చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ విజయ కుమారి, అంగన్వాడీ కార్యకర్తలు రమణ కుమారి, హైమావతి, సెంటర్ సహాయకురాలు గంగ, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

### బీజేపీ జిల్లా అధ్యక్షుడికి శుభాకాంక్షల వెల్లువ

**విశాలాంధ్ర - తాడిమర్రి :** సత్యసాయి జిల్లా బిజెపి అధ్యక్షులు జిఎం శేఖర్ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కన్వీనర్ దేవర రామ్మోహన్ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రానికి తరలివెళ్లి బిజెపి కార్యాలయంలో జిఎం శేఖర్ ను బిజెపి మండల అధ్యక్షుడు దేవర రాము ఆధ్వర్యంలో గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అనుగుత్తి రమణ కత్తి నాగభూషణం సదాశివుడు గొంగటి బుల్లెట్ రమేష్, సీనయ్య, సూరి, నిడిగల్లు రామాంజనేయులులు పాల్గొన్నారు.